ప్రజాశక్తి
మంగళవారం 18 నవంబరు, 2025
5
శ్రీకాకుళం

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

ఆర్‌డిఒ వెంకటేష్

పలాస : ప్రైవేటు ఆస్పత్రుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని ఆర్‌డిఒ జి.వెంకటేష్ హెచ్చరించారు. ఆర్‌డిఒ కార్యాలయంలో సబ్ డిస్ట్రిక్ట్ మల్టీ లెవెల్ అప్రోప్రియట్ అథారిటీ అడ్వైజరీ కమిటీ మెంబర్ల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి స్కానింగ్ సెంటర్ వచ్చే గర్భిణుల పేర్లు నమోదు చేసి ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే స్కానింగ్ సెంటర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి స్కానింగ్ సెంటర్‌లోనూ సిసి కెమెరాలు పర్యవేక్షణ సక్రమంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ వైద్యాధికారి మేరీ కేథరిన్, డాక్టర్ నాగ సుశీల, శివరంజని, ఎర్రన్న, కో-ఆర్డినేటర్ మోహిని రత్నకుమారి, చైల్డ్‌లైన్ బాలసరస్వతి పాల్గొన్నారు.

వేడెక్కుతున్న ఎయిర్‌పోర్టు ఉద్యమం

- విశాఖ సదస్సులో ఎయిర్‌పోర్టు నిర్మాణంపై ఒప్పందం
- భగ్గుమన్న ప్రభావిత గ్రామాల ప్రజలు
- నేడు పలాసలో ధర్నాకు పిలుపు
- పోలీసుల అనుమతి నిరాకరణపై జనం మండిపాటు

కార్గో ఎయిర్‌పోర్టుపై ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్తున్నట్లు కనిపిస్తోంది. ప్రజలు, రైతులు వద్దంటున్నా పలుమార్లు భూముల సర్వేకు ప్రయత్నించి విఫలమైన ప్రభుత్వం, తాజాగా విశాఖలో నిర్వహించిన సిఐఐ సదస్సులో ఎయిర్‌పోర్టుపై ఒప్పందం కుదుర్చుకోవడంతో స్థానికులు భగ్గుమంటున్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ పలాస ఆర్‌డిఒ కార్యాలయం వద్ద మంగళవారం ప్రభావిత గ్రామాల ప్రజల ధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో, ఆయా గ్రామాల ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. అనుమతి లేకుండా నిరసనలు చేపడితే అరెస్టు చేసేందుకు పోలీసులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. మరోవైపు ధర్నా చేసి తీరుతామని ప్రజలు పట్టుదలగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్టు ప్రభావిత గ్రామాల్లో టెన్షన్ వాతావరణం నెలకొంది.

ఆర్‌డిఒ కారును అడ్డుకున్న పోర్టు ప్రభావిత గ్రామస్తులు (ఫైల్)

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

కార్గో ఎయిర్‌పోర్టుపై ప్రజలను ఒప్పించి వ్యతిరేకత లేకుండా నిర్మాణం చేపడతామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చెప్పిన మాటలకు, ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలకు పొంతన లేకుండా పోయింది. గ్రామాల్లోకి ప్రజలను ఒప్పిస్తామన్న కేంద్ర మంత్రి విశాఖ సిఐఐ సమ్మిట్‌లో ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మధ్య అవగాహన ఒప్పందం చేయించడంలో కీలకపాత్ర వహించారు. ఎయిర్‌పోర్టు వద్దని తాము చెప్తున్నా, ప్రజల అభిప్రాయంతో పని లేకుండా ఏకపక్షంగా ఎంఒయు చేసుకోవడంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ బలవంతపు భూసేకరణ, కార్గో ఎయిర్‌పోర్టు ప్రతిపాదన రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ మంగళవారం పలాస ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నాకు పిలుపునిచ్చింది. ధర్నాకు సైతం పోలీసులు అనుమతి నిరాకరించడంపై ప్రభావిత గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు.

ప్రజల గొంతు నొక్కే ప్రయత్నమేనా..?

ఎయిర్‌పోర్టు విషయంలో ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలతో పని లేనట్టుగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎయిర్‌పోర్టును ఎలాగైనా కట్టి తీరాలన్న లక్ష్యంతో అడుగులు వేస్తున్న టిడిపి కూటమి ప్రభుత్వం, ప్రజాస్వామ్య హక్కులను సైతం కాలరాసేందుకు వెనకడుగు వేయడం లేదు. తొలి నుంచీ వారి గొంతు నొక్కేందుకు యత్నిస్తోంది. గతంలో మాజీ ఎంపీ వడ్డే శోభనాద్రీశ్వరరావు ఎయిర్‌పోర్టు ప్రభావిత గ్రామాల్లో పర్యటనకు వచ్చినప్పుడు పోలీసులు కనీసం టెంట్ వేయనీయలేదు. సమావేశానికి వెళ్లనీయకుండా ప్రజలను పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. గ్రామాల నుంచి బయటకు రానీయకుండా నిర్బంధం విధించారు. ఇప్పుడు శాంతియుతంగా చేపట్టనున్న ధర్నాకు సైతం నిరాకరించడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

పోటాపోటీ కార్యక్రమాలతో మరింత వ్యతిరేకత

తమ పచ్చని పొలాల్లో ఎయిర్‌పోర్టుతో బతుకులు పోతాయని ఎయిర్‌పోర్టు ప్రభావిత గ్రామాల ప్రజలు బతుకు పోరాటం చేస్తుంటే, అందుకు ప్రతిగా ఎయిర్‌పోర్టుకు అనుకూలంగా మందస ప్రాంతానికి చెందిన కొందరు టిడిపి కూటమి నాయకులు సోమవారం పలాస ఆర్‌డిఒ జి.వెంకటేష్‌కు వినతిపత్రం ఇచ్చారు. దీనిపై ప్రభావిత గ్రామాల రైతులు, మహిళలు, యువత మండిపడుతున్నారు. తమ పొలాల్లో ఎయిర్‌పోర్టు నిర్మించాలని వారు అడగడమేమిటని, ఎయిర్‌పోర్టు కావాలనుకుంటే వారి భూముల్లో కట్టుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టిడిపి కూటమి వినతిపత్రం ఇవ్వడం వెనుక కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష హస్తముందన్న చర్చ నడుస్తోంది. నేతలు వ్యవహరిస్తున్న తీరు ప్రజల్లో మరింత వ్యతిరేకతకు దారితీస్తోందన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఎయిర్‌పోర్టుతో సంబంధం లేని గ్రామాల నాయకులతో వినతిపత్రం ఇప్పించడం ప్రజలను రెచ్చగొట్టడమేనన్న చర్చ గ్రామాల్లో సాగుతోంది.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

స్మార్ట్ కిచెన్లు వద్దే వద్దు

కలెక్టరేట్ వద్ద వంట కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు స్మార్ట్ కిచెన్ సెంటర్ల పేరుతో ప్రైవేట్, స్వచ్ఛంద సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నాలను తక్షణమే విరమించుకోవాలని మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.మహాలక్ష్మి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.సుశీల, బి.ఉత్తర, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని, స్మార్ట్ కిచెన్ల ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ కిచెన్ వ్యవస్థ వల్ల మండలం మొత్తానికి ఒకే దగ్గర వండి పలు పాఠశాలలకు పంపించడం వల్ల వేడి ఆహారం అందదన్నారు. ఇది పథక లక్ష్యానికి పూర్తి విరుద్ధమని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇస్కాన్, అక్షయపాత్ర, నాంది ఫౌండేషన్ వంటి సంస్థలకు వంట ఏజెన్సీల్లో విఫలమయ్యాయని తెలిపారు. ఆ ఏజెన్సీలకు ఇచ్చిన చోట విద్యార్థులకు వేడి ఆహారం, సక్రమంగా మెనూ అమలు కావడం లేదన్నారు. మన జిల్లాలోనూ శ్రీకాకుళం, గార, ఆమదాలవలస మండలాల్లో ప్రైవేట్ ఏజెన్సీలకు ఇచ్చి అనేక విమర్శలు ఎదుర్కొంటున్న పరిస్థితి ఉందన్నారు. 20 ఏళ్లుగా మధ్యాహ్న భోజన నిర్వాహకులు సేవా దృక్పథంతో పథకాన్ని నిర్వహిస్తున్నారని, వీరికి కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యుటీ, పెన్షన్ వంటివి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకుండా, ఈరకంగా ఉన్న ఉపాధినీ తీసేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించే ఆలోచనలు విరమించుకోకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ధర్నా అనంతరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'మీకోసం'లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి.సీతమ్మ, కె.కౌసల్య, వై.లక్ష్మి, పి.భూదేవి, జి.ప్రబావతి, జి.నాగమణి పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సు ప్రారంభం

వజ్రపుకొత్తూరు : ప్రతిపల్లెకూ పల్లెవెలుగు ఆర్‌టిసి బస్సు సౌకర్యం కలిపిస్తామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని గుల్లలపాడులో ప్రజల రాకపోకలు సాగించడానికి పల్లెవెలుగు బస్సు సౌకర్యాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధికి రవాణా సౌకర్యాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ప్రతి గ్రామానికీ కలుపుతూ తారురోడ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. మహిళలు తమ అవసరాలు కోసం పెద్ద ఎత్తున ప్రయాణాలు సాగిస్తున్నారని వారికి అందుబాటులో బస్ సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆర్‌టిసి సేవలు సేవలు ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. s పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు సర్పంచ్ ప్రతినిధి దువ్వాడ హేమబాబు చౌదరి, పలాస ఆర్‌టిసి డిపో మేనేజర్ ఎస్.ఎస్.నాయుడు, కూటమి నాయకులు పి.సాంబమూర్తి,వంశీకృష్ణచౌదరి, సూర్యనారాయణ, శశిభూషణ్, ఆదినారాయణ పాల్గొన్నారు.

జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

'ఉపాధి' ఉసురు తీస్తున్న కేంద్రం

- 15 లక్షల జాబ్‌కార్డుల తొలగింపు దుర్మార్గం
- ఏడాదికి 200 రోజులు పని కల్పించాలి
- రోజుకు రూ.600 కూలి ఇవ్వాలి
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ ఉసురు తీస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు విమర్శించారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం విస్తృతస్థాయి సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పేదలు, దళిత, గిరిజన, బలహీన వర్గాలకు చెందిన 15 లక్షల జాబ్‌కార్డుల తొలగింపునకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. ఉపాధి కూలీలకు ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని, రోజు కూలి రూ.600 అందజేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధి హామీని పటిష్టంగా అమలు చేసి గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. దళితులు, గిరిజనుల భూములకు రక్షణగా ఉన్న 9/77 చట్ట సవరణను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పేదల సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. జిల్లాలో కార్గో ఎయిర్‌పోర్టు, థర్మల్ విద్యుత్కేంద్రం పేరుతో చేపడుతున్న బలవంతపు భూసేకరణ తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. ఎయిర్‌పోర్టు, థర్మల్ ప్లాంట్‌ను రద్దు చేయాలని సాగుతున్న ప్రజా పోరాటంలో వ్యవసాయ కార్మిక సంఘం ప్రత్యక్షంగా భాగస్వామ్యమవుతుందని స్పష్టం చేశారు. రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై ఈనెల 27న విజయవాడలో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిర్ల ప్రసాదరావు, గంగరాపు సింహాచలం, ఉపాధ్యక్షులు జి.ఈశ్వరమ్మ, సహాయ కార్యదర్శి కొల్లి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

'మీకోసం'కు 120 ఫిర్యాదులు

సమస్యలు వింటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రైవేట్ స్కూల్స్, కాలేజీల బస్సులు ఫిట్నెస్ లేకుండా నడుపుతున్న తరుణంలో విద్యార్థుల ప్రాణాలకు ప్రమాదం కలిగిస్తుందని, తక్షణమే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండర్ జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. అన్ని బస్‌లకు ఫిట్ నెస్, నిబంధనలు పరిశీలించి అనుమతులు ఇవ్వాలని అన్నారు. బస్సు ప్రమాదాలు నియంత్రణకు చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. ప్రైవేట్ సెక్టార్‌లో పెంచిన 12 గంటలకు చట్టాలు రద్దు చేయాలని ఐఎఫ్‌టి యూనియన్ నాయకులు క్రాంతి, గణేష్ ఫిర్యాదు చేశారు. శ్రీకాకుళం నుంచి కుప్పిలి వరకు ఆర్‌టిసి బస్సులు నడుపుతున్నారని, బుడగుట్లపాలెం వరకు విస్తరించాలని ఎం.అరుణకుమార్ ఫిర్యాదు చేశారు. పొందూరు మండలం కొంచాడకు చెందిన బ్రహ్మం తనకు వికలాంగ పింఛన్ మంజూరు చేయాలని, 72 శాతం ధ్రువీకరణ పత్రం ఉందని అన్నారు. శ్రీకాకుళం పట్టణానికి చెందిన లక్ష్మి తనకు అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయని అన్నారు.

జిల్లా అధికారులు హాజరు కావాలి

జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. వచ్చిన ఫిర్యాదుల సమస్యలపై క్షేత్రస్థాయిలో స్పందించి నివేదికలు అందజేయలన్నారు. పరిష్కార వేదికకు జిల్లా అధికారులు హాజరుకాకుంటే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. అర్జీలు స్వీకరణలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, విశ్రాంత జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పద్మావతి, జి.జయదేవి, డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు 'అన్నదాత సుఖీభవ' నిధుల జమ

వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

అన్నదాత సుఖీభవ' పథకాన్ని ఈ నెల 19న రెండో విడత నిధులు జమ చేయనున్నామని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని నిమ్మాడ క్యాంప్ కార్యాలయం నుంచి రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్, 26 జిల్లాల జెడిలతో సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పలు సూచలను అధికారులకు జారీ చేశారు. కేంద్రం రూ.2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.5 వేలు కలిపి రూ.7 వేలు రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి అందాలని అన్నారు. రైతులకు చేయూతనివ్వడం భారం కాదు.. బాధ్యత అని గుర్తెరగాలని పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ పథకం రెండో విడత అమలు కార్యక్రమం పండగ వాతావరణంలో నిర్వహించాలని, అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 19న వైఎస్‌ఆర్ జిల్లా కమలాపురం నియోజకవర్గంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి రైతుల ఖాతాల్లో నగదు జమ చేసేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అవసరమైన చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. ఎన్‌పిసిఎలో ఇన్ యాక్టివ్‌గా ఉన్న ఖాతాలను యాక్టివేట్ చేయాలని, క్షేత్రస్థాయిలో వ్యవసాయశాఖ అధికారులు సన్వయం చేసుకుని పర్యవేక్షించి వాటిని సరిచేయాలని సూచించారు. అర్హులైన రైతులు చనిపోయిన పక్షంలో వారి వారసులకు డెత్ మ్యూటేషన్ చేసి ఈ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్నదాత సుఖీభవ పథకం అర్హత ఉన్నవారు ఆన్‌లైన్‌లో రైతులు నమోదు చేసుకునే విధానాన్ని సులభతరం చేయాలని సూచించారు. రాష్ట్రంలో అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ పథకం కింద రెండో విడత 46,62,904 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుందని వివరించారు. ఈ పథకం కింద రూ.3077.77 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్టు చెప్పారు. ఈ పథకంపై సందేహాల నివృత్తి కోసం టోల్‌ఫ్రీ నంబరును అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశించారు. అన్నదాత సుఖీభవ అందుకునే రైతుల సెల్‌ఫోన్లకు ఒక రోజు ముందే సందేశాలు వెళ్లాలన్నారు. రైతులు తమ ఖాతాలను యాక్టివేట్ చేసుకునేలా వారికి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. తొలివిడతలో జమకానివి రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులు పరిశీలించి అర్హత ఉన్న వారికి అన్నదాత సుఖీభవ పథకం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎక్కువ కేసులు రాజీ చేయాలి

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం లీగల్: జాతీయ లోక్ అదాలత్‌ను డిసెంబరు 13వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా వెల్లడించారు. జిల్లా కోర్టు భవనంలో పోలీసు అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసి పని భారం తగ్గించుకోవాలన్నారు. రాజీ పడ దగిన క్రిమినల్, సివిల్ కేసులను జాతీయ లోక్ ఆదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించి, ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు కృషి చేయాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసు రాజీ అయితే ఇరు పక్షాలకూ గెలుపే ఉంటుందని తెలిపారు. సమావేశంలో మొదటి, మూడు, నాలుగో అదనపు జిల్లా జడ్జీలు పి.భాస్కరరావు, సిహెచ్.వివేక్ ఆనంద్ శ్రీనివాస్, ఫణికుమార్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు, అడిషనల్ సివిల్ జడ్జి పి.శాంతిశ్రీ, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ పాల్గొన్నారు

పుస్తక పఠనంతో విజ్ఞానం

జిల్లా విద్యాశాఖాధికారి రవికుమార్

మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి రవికుమార్

ప్రజాశక్తి - అరసవల్లి

పిల్లలను సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచి, పుస్తకాలను చదివించాలని జిల్లా విద్యాశాఖాధికారి రవికుమార్ తల్లిదండ్రులకు సూచించారు. పుస్తక పఠనంతో విజ్ఞానం లభిస్తుందన్నారు. నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్న సిక్కోలు పుస్తక మహోత్సవాన్ని ఏడో రోజు సోమవారం ఆయన సందర్శించి పుస్తక ప్రదర్శనను తిలకించారు. కాళీపట్నం రామారావు సాహిత్య వేదికపై 'ఉత్కళాంధ్ర సాహిత్య, సాంస్కృతిక సంబంధాలు' అంశంపై చర్చాగోష్టిని రచయిత నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. రచయిత్రి తుర్లపాటి రాజేశ్వరి మాట్లాడుతూ ఆనాటి రాజులు కూడా పద్య పఠనం, సాహిత్యంపై అభిరుచి కలిగి ఉండే వారన్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు కూడా ఒక పుస్తకాన్ని అప్పటి ఒరిస్సా కళింగ రాజుతో ఆవిష్కరించారని తెలిపారు. రచయిత అడపా రామకృష్ణ మాట్లాడుతూ ఆధునిక తెలుగు సాహిత్యంలో కళింగాంధ్ర కవులు చైతన్యవంతమైన రచనలు చేశారని చెప్పారు. రచయిత ఈ-వేమన మాట్లాడుతూ రైతులు, గిరిజనుల ఇబ్బందులపై ఛాయరాజ్ విప్లవ సాహిత్యం అందించారన్నారు. అనంతరం రచయిత ఉదయకిరణ్ రచించిన ఖాకీ చొక్కా పుస్తకాన్ని నాగరాజు పరిచయం చేశారు. మామిడి కోదండరావు రచించిన 'వర్తమానం నుంచి గతం వైపు' పుస్తకాన్ని రచయిత తిరుపతిరావు పరిచయం చేశారు. కవితా వసంతం పుస్తకాన్ని రచయిత ముట్నూరు ఉపేంద్రశర్మ పరిచయం చేశారు. అనంతరం కవి సమ్మేళనం నిర్వహించారు.

కాగితాపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు 'హత్యా..?, భ్రమా..? ప్రయోగాన్ని ప్రదర్శించారు. మొండెం లేని తల మాత్రమే ఉండేలా ప్రదర్శన ఆకట్టుకుంది. మ్యాజిక్ షో, సైన్స్ ప్రయోగాల్లో విద్యార్థులు పాల్గొన్నారు. జెవివి ప్రతినిధి బాయన్న వేడి నూనెలో బజ్జీలను చేతితో తీసే విధానం ఆకట్టుకుంది. భామిని మండలం జక్కన గ్రామానికి చెందిన మిన్నారావు ఆధ్వర్యాన థింసా నృత్యం అలరించింది. గిడుగు రామ్మూర్తి పంతులుగా భోగెల ఉమామహేశ్వరరావు, అల్లసాని పెద్దన్నగా వాడాడ శ్రీనివాసరావు, గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం పంతులు వేషధారణలు ఆకట్టుకున్నాయి. బొడ్డేపల్లి జనార్ధన్ 'సమాజం మేలుకో', కిమ్మి సంతోష్ 'శిశుపాలుడు' ఏకపాత్రాభినయాలతో అలరించారు. ఆమదాలవలసకు చెందిన కె.శ్రీలత ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి.



థింసా నృత్యం చేస్తున్న గిరిజనులు

హత్య..? భ్రమ..? ప్రదర్శన

నేటి కార్యక్రమాలు

నాలుగు గంటలకు సైన్స్ వైజ్ఞానిక కార్యక్రమాలు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, మ్యాజిక్ షో. ఐదు గంటలకు కళింగాంధ్ర చరిత్ర- వర్తమానం చర్చాగోష్ఠి. దక్షిణాదిన సంక్షోభంలో ఆంధ్రప్రదేశ్, సందువ, దేశం లోపల యుద్ధం, లయ తరంగం పుస్తకావిష్కరణలు. అనంతరం కవితా పఠనం. రంగం ప్రజా సాంస్కృతిక వేదిక హేమసూదన్ బృందం ఆధ్వర్యాన డప్పు వాయిద్యాం, నృత్యం, సంప్రదాయ కోలాటం ప్రదర్శన. వయోలిన్ సోలో, జానపద నృత్యరూపకం (రైతు కోసం).

మ్యాజిక్ ట్యూబ్‌ను చూస్తున్న విద్యార్థిని

పబ్లిక్ నోటీస్

నా క్లైంట్ నిద్ర బంగి ఝాన్సీ లక్ష్మి w/o నిద్ర బంగి తవిటి రెడ్డి, ఇంటి నెంబరు 2-81 మెయిన్ స్ట్రీట్, తానేం, విలేజ్, పొందూరు మండలం శ్రీకాకుళం, జిల్లా కాపురస్తులు ఇచ్చిన బోగట్టపై ఈ పబ్లిక్ నోటీస్ జారీ చేయడమైనది.

నా క్లైంట్, పొందూరు సబ్ రిజిస్ట్రార్ పొందూరు ఆఫీస్‌లో రిజిస్టర్ కాబడిన శుద్ధ క్రయ దస్తావేజు బేరింగ్ డాక్యుమెంట్ నెంబర్ 253/2014 తేదీ 01.02.2014 మరియు 3124/2014 తేదీ 01.11.2014 న ఈ క్రింది పేర్కొన్న షెడ్యూల్ దాఖలా ఆస్తిని దల్లి వెంకట్ రెడ్డి నుండి మరియు గొర్బు ఈశ్వరరావు వగైరాలనుండి పొంది ఉన్నారు సదరు కాలం నుండి నా క్లైంట్ పూర్తి హక్కు, అనుభవంలో ఉంటున్నారు. ఇది ఇలా ఉండగా పై పేర్కొన్న ఒరిజినల్ డాక్యుమెంట్ పట్టుకుని తానేం గ్రామం నుండి పొందూరు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్ళుచుండగా మార్గమధ్యములో పొందూరు బస్టాండ్ వద్ద పోయినవి. నా క్లైంట్ ఈ క్రింది షెడ్యూల్ ఆస్తిని డి సి సి బ్యాంక్ పొందూరు వద్ద గాని మరే ఇతర బ్యాంకుల వద్ద గాని ,లోను తీసుకొనుటకు నిర్ణయించుకొన్నారు, కనుక ఎవరికైనా, ఏ ఫైనాన్స్ కంపెనీల కైనా, బ్యాంక్స్ వారికైనా, వేరెవ్వరికైనా, ఎటువంటి ప్రైవేట్ సంస్థల కైన ఎటువంటి అభ్యంతరాలు మరియు హక్కులు ఉన్న యెడల ఈ ప్రచురణ జరిగిన ఏడు రోజులలో సంబంధిత డాక్యుమెంట్స్ తో ఈ క్రింది అడ్రస్ కు హాజరుకావలెను, అట్లు చేయని యెడల ఈ క్రింది షెడ్యూల్ ఆస్తి ఎటువంటి వివాదం లేని ఆస్తిగా భావించెదమని ఈ పబ్లిక్ నోటీస్ ద్వారా తెలియజేయుచున్నాము. ఈ పబ్లికేషన్ విడుదల చేసిన ఏడు రోజుల తర్వాత ఎటువంటి అభ్యంతరాలు తెలియజేసినను నా క్లైంట్ ఎటువంటి బాధ్యత వహించరని తెలియజేయడమైనది

షెడ్యూల్ ఆస్తి

శ్రీకాకుళం జిల్లా, పొందూరు SRO పరిధి, పొందూరు, మండలం తానేం గ్రామ రెవెన్యూ,బాణాం గ్రామ పంచాయతీ లో ఉన్నటువంటి సర్వే నెంబర్ 9/6 లో Ac 0.14 సెంట్లు 1వ ప్రతిగాను , సర్వేనెంబర్ 9/20 లో Ac 0.14 సెంట్లు 2వ ప్రతిగాను మరియు సర్వేనెంబర్ 21/3 Ac 0.21 సెంట్లు 3వ ప్రతిగాను అయి ఉన్నది.

షెడ్యూల్ ఆస్తికి హద్దులు

ఒకటవ ప్రతి హద్దులు : తూర్పు : దల్లి అంకమ్మ గారి జీ పల్లం **దక్షిణ** : దువ్వి లక్ష్మి గారి జీ పల్లం, **పడమర** : నిద్ర బంగి తవిటి రెడ్డి గారి జి పల్లం, **ఉత్తర** : పైల దాలయ్య గారి జీ పల్లం.

రెండవ ప్రతి హద్దులు: తూర్పు : గొరుసు దానమ్మ గారి జీ పల్లం **దక్షిణ** : పైల అప్పయ్య గారి జీ పల్లం, **పడమర:** కోన శ్రీహరి తాలూకా జి పల్లం, **ఉత్తర:** సుంకరి ముత్యాలు గారి జీపల్లం.

మూడవ ప్రతి హద్దులు : తూర్పు: బచ్చు లక్ష్మి గారి జి మెట్టు. **దక్షిణ:** బాకి సూర్యనారాయణ గారి జి మెట్టు. **పడమర** : నిద్ర బంగి తవిటి రెడ్డి గారి జి మెట్టు. **ఉత్తర** :నిద్ర బంగి తవిటి రెడ్డి గారి జీ మెట్టు.

ఇట్లు
మామిడి క్రాంతి, సీనియర్ న్యాయవాది,
ఫ్లాట్ నెంబర్ 303, మూడవ అంతస్తు,
అరుణ కౌంటీ, అపార్ట్మెంట్ , జానకిరామ్ నగర్,
రైతు బజార్ పెట్రోల్ బంక్ వెనుక,
శ్రీకాకుళం టౌన్, పిన్ నెంబర్ 532001
సెల్ నెంబర్స్ : 9440028462, 889750322.

అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పి మహేశ్వరరెడ్డి

అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రజా ఫిర్యాదులు స్వీకరణ, పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్) కార్యక్రమంలో స్వీకరించే ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి పూర్తిస్థాయిలో విచారణ జరిపి పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పి కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో ముందుగా వృద్ధులు, వికలాంగుల వద్దకు ఎస్పి స్వయంగా వెళ్లి వారి అర్జీలు స్వీకరించారు. జిల్లాలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన 53 మంది ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పి ముఖాముఖీగా మాట్లాడి వారి ఫిర్యాదులను వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, సత్వరం పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఆయా ఫిర్యాదులను సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి త్వరితగతిన చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం అందించేలా చూడాలన్నారు. ఫిర్యాదులన్నింటిపై తీసుకున్న చర్యలపై నివేదిక రూపంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి అందజేయాలని అధికారులకు సూచించారు.

రైతుసేవా కేంద్రం వద్ద యూరియా కోసం వేచిచూస్తున్న రైతులు

యూరియా కోసం పడిగాపులు

ప్రజాశక్తి- పొందూరు

మండలం రాపాక రైతుసేవా కేంద్రం వద్ద సోమవారం యూరియా కోసం రైతులు ఉదయం నుంచే పడిగాపులు కాశారు. ప్రస్తుతం మొక్కజొన్న సాగుకోసం యూరియా వినియోగించాల్సి ఉందని, దీనికోసం కనీసం ఒక్క బస్తా అయినా దొరుకుతుందో లేదోనని ఉదయం నుంచే పడిగాపులు కాయాల్సి వచ్చిందంటూ రైతులు పేర్కొంటున్నారు. గ్రామానికి 445 యూరియా బస్తాలు మాత్రమే రావడంతో ఆధార్, 1బి ఆధారంగా ఒక్కోరైతుకు ఒక బస్తా చొప్పున సంబంధిత అధికారులు పంపిణీ చేశారు. పూర్తిస్థాయిలో యూరియా రాకపోవడంతో అందని రైతులు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా గ్రామానికి చెందిన చాలా మంది రైతులకు సమీప రెవెన్యూ గ్రామాలైన కొంచాడ, పొందూరు, కోటిపల్లిలో భూములు ఉన్నాయి. ఈ భూముల్లో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నామని, 1బి ఆధారంగా యూరియాను పంపిణీ చేయడంతో యూరియా దొరక్క ఇబ్బంది పడుతున్నామంటూ పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో విడతలోనైనా సరిపడా యూరియాను సరఫరా చేసి రైతులందరికీ పంపిణీ చేయాలని వారంతా కోరుతున్నారు.

గ్రంథాలయాల్లో వ్యాసరచన పోటీలు

ఆమదాలవలస : డిబెట్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి- అరసవల్లి

జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయ కార్యదర్శి వివిజిఎస్ శంకరరావు ఆధ్వర్యంలో సోడవరం ఈశ్వరరావు నిర్వహణలో కవితా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు రచయితల వేదిక ప్రధాన కార్యదర్శి ఆర్.వి.రమణమూర్తి, సభ్యులు బి.ఉమామహేశ్వరరావు, ఇద్ది పాపయ్య, మంగిపూడి శ్రీనివాసరావు, ఐఎన్‌డి ప్రసాద్, ముట్నూరు ఉపేంద్ర శర్మ, టి.లింగరాజు, రోణంకి విశ్వేశ్వరరావు, రోణంకి దివిజ, యువ రచయితల వేదిక అధ్యక్షులు తంగి ఎర్రమ్మ, మాలతి, ఢిల్లేశ్వర్రావు, నీలయ్య తదితరులు పాల్గొన్నారు.

లావేరు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా లావేరు శాఖా గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. భగత్ సింగ్ జీవిత చరిత్రపై వక్తృత్వపు పోటీ, కందుకూరి వీరేశలింగం జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని బొడ్డేపల్లిపేట శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నేటి యువత - కర్తవ్యం అనే అంశంపై విద్యార్థులకు డిబేటింగ్ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 30మంది విద్యార్థులు పాల్గొన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు అంపోలు సూర్యారావు, త మ్మినేని సూర్యనారాయణలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

రణస్థలం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయంలో కవి సమ్మేళనంలో సారవకోటకు చెందిన కవి ఢిల్లేశ్వరరావు (ఋష్యశ్రీ) బాల్యమా నీవెక్కడ అనే అంశంపై, 'బరువవుతున్న బాల్యం'పై కవితా గానం చేశారు. ఈ సందర్భంగా ఢిల్లేశ్వరరరావుకు జిల్లా గ్రంథాలయ అధికారి వి.వి.జి.ఎస్.శంకరరావు దుశ్శాలువతో సత్కరించి మెమెంటో అందించారు. కవులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో జూనియర్ కళాశాల విద్యార్థులకు వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుష్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు వెంకటరమణయ్య, ఎంఆర్ రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.సునీత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

బూర్జ : మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుష్మ

రణస్థలం : ఢిల్లేశ్వరరావును సన్మానిస్తున్న శంకరరావు

మెళియాపుట్టి: స్థానిక గ్రంథాలయ అధికారి ఆర్.అనురాధ ఆధ్వర్యాన నలంద పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు ఈ పోటీలు నిర్వహించామన్నారు. ఎంఇఒలు ఎస్.దేవేందరరావు, ఎం.పద్మనాభరావులు పర్యవేక్షించారు. నలంద స్కూల్ డైరెక్టర్ జై.జై. ఎస్.ప్రతాప్, పోలాకి శారద, ప్రియాంక గణేష్, హేమలత పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక శాఖాగ్రంథాలయం వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను గ్రంథాలయాధికారి టి.ఇందిర నిర్వహించారు.

సంతబొమ్మాళి : సత్యసాయి విద్యా నికేతన్‌లో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.నీలకంఠేశ్వరరావు, ఉపాధ్యాయులు, గ్రంథాలయాధికారి ఎ.పోలయ్య, సహాయకులు ఎన్.ప్రసాద్ పాల్గొన్నారు.

టెక్కలి : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి బి.రూపావతి తెలిపారు. గ్రంథాలయాలు వాటి ప్రయోజనాలు అనే అంశంపై ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.దాశరథి, బమ్మిడి ఆరుణకుమార్, జి.ఆలివేణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తిలక్

రౌడీల్లా వ్యవహరించడం సరికాదు

వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త తిలక్

టెక్కలి రూరల్: మండలంలోని కాపుగోదాలయవలసలో ఆదివారం టిడిపి కార్యకర్తలు, నాయకులు వీధి రౌడీల్లా వ్యవహ రించారని టెక్కలి వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ విమర్శించారు. టెక్కలి వైసిపి కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ వైసిపి రచ్చబండ కార్యక్రమానికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక టిడిపి నాయకులు దాడులు చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి అచ్చెన్నాయుడు ప్రోద్బలంతోనే వైసిపి సభలో నాయకులపై దాడికి యత్నించారని విమర్శించారు. అధికారం దాహంతో పోలీసులను అడ్డుపెట్టుకొని దాడులకు ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. ఇదే కొనసాగితే భవిష్యత్‌లో టిడిపి నాయకులు, కార్యకర్తలు తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన



మరమ్మతులు చేపట్టిన ట్రాన్స్‌ఫార్మర్లు

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని తెప్పలవలస పంచాయతీలో వ్యవసాయ పంపుసెట్లుకు సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు సోమవారం మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరా అందించారు. సోమవారం ప్రజాశక్తి దినపత్రికలో 'కరెంటు కష్టం..పంట నష్టం' అనే శీర్షికతో వార్త ప్రచురించడంతో విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి తెప్పలవలస పంచాయతీ పరిధిలో ఉన్న వ్యవసాయ పంపుసెట్లకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్‌లకు మరమ్మతులు చేయించారు. వ్యవసాయ పంపుసెట్లకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్‌లు మరమ్మతులకు గురై నీరు తోడకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా తాత్సారం చేశారని రైతులు ఆరోపించారు.

కాలువలో పైప్‌లైన్ తొలగింపు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

జెసిబితో పైప్‌లైన్ తొలగింపు పనులు చేపడుతున్న అధికారులు

పొందూరు: మండలంలోని కింతలి గ్రామంలో మురుగు కాలువలో ఉన్న తాగునీటి పైప్‌లైన్ తొలగింపు పనులను సోమవారం ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రాజు ఆధ్వర్యంలో సిబ్బంది చేపట్టారు. ఈనెల 13న 'మురుగుకాలువలో తాగునీటి పైప్‌లైన్' అంటూ ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. గ్రామంలో జలజీవన్ మిషన్ పనులు చేపట్టినప్పుడు ప్రధాన రహదారిని ఆనుకుని, సచివాలయం ఎదురుగా ఉన్న మురుగు కాలువలో తాగునీటి పైప్‌లైన్‌ను అధికారులు వేశారు. ఈ పనులు చేపట్టి సుమారు రెండేళ్లు దాటినా మురుగుకాలువలో పైప్‌లైన్ తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టకేలకు అధికారులు స్పందించి మురుగు కాలువలో పైప్‌లైన్ తొలగించే పనులు చేపట్టడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ వాసుదేవరావు

స్వామిత్వ సర్వేను పూర్తి చేయాలి

ప్రజాశక్తి- పొందూరు

మండలంలో నిర్దేశించిన గ్రామాల్లో చేపడుతున్న స్వామిత్వ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు పేర్కొన్నారు. మండలంలోని అచ్చిపోలవలస, తుంగపేట గ్రామాల్లో సోమవారం స్వామిత్వ గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ఆస్తి, భూములకు సంబంధించిన యజమానులు, వారి హక్కులు, వాటాల వివరాలను గుర్తించి నమోదు చేసి చట్టపరమైన ధ్రువీకరణ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పి.వేణు గోపాలం, పి.సన్యాసిరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

జి.సిగడాం రూరల్: మండలంలోని బాతువలో సిఎం సహాయనిధి నుంచి వచ్చిన రూ.2 లక్షల 10 వేలు చెక్కులను నలుగురు లబ్ధిదారులకు సోమవారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్సకోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కుమారపు రవికుమార్, బాలబొమ్మ వెంకటేశ్వరరావు, బురాడ వెంకటరమణ, కుదిరేళ్ల బుజ్జి, అర్జున్ భూపతి, డబ్బాడ కళ్యాణి, కూర్మారావు, ఆదినారాయణ, సర్పంచ్‌లు వెంకటరావు మాస్టర్, మహేష్, సాకేటి నాగరాజు, అప్పలనాయుడు పాల్గొన్నారు.



సిఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

నేడు శిక్షణ

మెళియాపుట్టి : మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు 'స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు - క్లీన్ అండ్ గ్రీన్'పై శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సర్పంచ్, ఉప సర్పంచ్‌లు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం, గ్రామస్థాయి సుస్థిర అభివృద్ధి కార్యక్రమాల అమలుపై అవగాహన కల్పిస్తామన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నరసన్నపేట: నరసన్నపేట మార్కెట్ యార్డు వద్ద మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్నట్లు ఎఎంసి చైర్మన్ పి.ఉమామహేశ్వరి తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఉదయం 10 గంటలకు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంభిస్తారని అన్నారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొవాలని కోరారు.

సిరియాకండిలో గ్రామసభ

మెళియాపుట్టి : మండలంలోని సిరియాకండి సచివాలయంలో సోమవారం స్వామిత్ర గ్రామసభను ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా నిర్వహించారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎస్.దేవేందరరావు, సర్పంచ్ ప్రతినిధి తాడేల రామరాజు, మండల కో-ఆప్షన్ మెంబర్ భాస్కర్‌దాసు, సచివాలయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ షూస్ అందజేత

నరసన్నపేట: నరసన్నపేట ఈశ్వర్ ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు మార్పు విజయ్ కుమార్ గొట్టిపల్లి మైదానంలో స్పోర్ట్స్ శిక్షణ పొందుతున్న నిరుపేద క్రీడాకారులకు స్పోర్ట్స్ షూస్ వితరణగా సోమవారం అందించారు. కోచ్ ఖగేశ్వరరావు క్రీడాకారులకు ఉన్న ఇబ్బందిని చెప్పిన వెంటనే స్పందించి... స్పోర్ట్స్ షూస్‌ను అందజేశారు. కార్యక్రమంలో సాయి దుర్గా ప్లెక్సీ అధినేత దండి భాస్కరరావు, గాంధీనగర్ యూత్ లీడర్ పొట్నూరు పృథ్వీరాజ్, సహాయ కోచ్ సురేష్ పాల్గొన్నారు.

అన్నదాత సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అన్నదాత సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. వజ్రపుకొత్తూరు మండల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు కణితి సురేష్ చౌదరి ఆధ్వర్యాన నిర్వహించిన అదనపు భవన నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు మెరుగైన సత్వర సేవలు అందించుటకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనేక చర్యలు చేపడుతున్నారని తెలిపారు. రైతులు అవసరాలను దృష్టిలో ఉంచుకొని సుమారు రూ.28 లక్షలతో అదనపు భవన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. పిఎసిఎస్ అధ్యక్షుడు కణితి సురేష్ చౌదరి చొరవతో మండలంలోని 2500 మంది రైతులకు రూ.26 కోట్లు మేర రుణాలను పిఎసిఎస్ ద్వారా అందించారని అన్నారు. రైతులకు మేలు చేయాలనే తపనతో కూటమి ప్రభుత్వం, నాయకులు పనిచేస్తున్నారని అన్నారు. పిఎసిఎస్ పాలకవర్గం సిబ్బంది రైతుల సేవకు అందుబాటులో ఉంటూ సొసైటీ అభివృద్ధిని పరుగులు పెట్టించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పి.విఠల్‌రావు, డిసిసిబి చైర్మన్ శివ్వల సూర్యనారాయణ, సెంట్రల్ బ్యాంకు సిఇఒ డి.సత్యనారాయణ, వజ్రపుకొత్తూరు పిఎసిఎస్ సిఇఒ ఎ.జగదీశ్వరరావు, పలాస పిఎసిఎస్ అధ్యక్షుడు వంకల కూర్మారావు, నెయ్యల సూర్యనారాయణ, వంక రామారావు, ఆకుల పాపారావు, డైరెక్టర్లు రాపాక శాంతమూర్తి, కొత్తూరు అప్పారావు, పాపారావు, టి.కృష్ణారావు, శాంతరావు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

నిరసన తెలుపుతున్న కార్మికులు

కార్మికుల జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని రావివలస సమీపంలో ఎంటర్ ప్రైజెస్, ఎంటర్ ప్రైజింగ్ గ్రానైట్ కార్మికుల జీతభత్యాలు తక్షణం చెల్లించాలని జిల్లా గ్రానైట్ మైన్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు నంబూరు షణ్ముఖరావు డిమాండ్ చేశారు. దీంతో రావివలస కార్మికులు సోమవారం టెక్కలి సిఐటియు కార్యాలయంలో సమావేశం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంటర్‌ప్రైజ్ గ్రానైట్ కంపెనీ ఉత్పత్తి పనులు నిలుపుదల చేసిన తరువాత డ్రిల్లర్సుకు, కంపెనీ సిబ్బంది పనిచేసిన కాలానికి పుల్ అండ్ ఫైనల్ చెల్లించాల్సి ఉందని అన్నారు. యూనియన్ ఆధ్వర్యాన 30 మంది కార్మికులకు చెల్లించాల్సిన సొమ్ము లెక్కలు కట్టి ఏడాది కావస్తున్నా చెన్నైలో ఉన్న యాజమాన్యం డబ్బులు పంపలేదని అన్నారు. విశాఖపట్నం సెంట్రల్ లేబరు అధికారులకు ఫిర్యాదు పంపితే నిర్వహించిన జాయింట్ సమావేశాలకూ యాజమాన్యం హాజరు కాలేదని తెలిపారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత యాజమాన్యాలకు అనుకూలంగా కార్మిక చట్టాల్లో మార్పులు చేయడం వల్ల సెంట్రల్ లేబరు అధికారులు, మైనింగ్ కార్మికుల సమస్యలు పూర్తిగా పట్టించుకోవడం లేదన్నారు. దీనితో గ్రానైట్ కంపెనీలో భద్రత లేక తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. కార్మికుల జీతభత్యాలు కూడా సక్రమంగా చెల్లించడం లేదని అన్నారు. తక్షణం కార్మికుల బకాయిలు చెల్లించాలని లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు జోగ భైరాగి, బెవర సూర్యనారాయణ, ఎ.వెంకటరావు, దాసరి నాగేసు, గున్న నర్సింహులు, అప్పిని కృష్ణ పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్ల అభివృద్ధే లక్ష్యం

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి మరింత వేగవంతం చేయడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని పాలేశ్వరస్వామి ఆలయం వద్ద సంతబొమ్మాళి-కోటబొమ్మాళి ప్రధాన రహదారి అభివృద్ధి పనులకు రూ.3.80 లక్షల వ్యయంతో సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో గ్రామీణ అభివృద్ధి తీవ్రంగా కుంటుపడిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లెల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కొత్త ఊపిరి లభించిందని తెలిపారు. రహదారుల రూపురేఖలు మారుతున్నాయని, పల్లెల పూర్వ వైభవాన్ని తిరిగి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పథకాలు అమలు చేస్తోందని, గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ హేమసుందర్, ఎంపిడిఒ జయంతిప్రసాద్, పిఎసిఎస్ అధ్యక్షులు కాంతారావు, టిడిపి నాయకులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న, అట్టాడ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

అర్హులకు సంక్షేమ పథకాలు

కోటబొమ్మాళి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ... అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో ప్రజల నుంచి సోమవారం వినతులు స్వీకరించారు. ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని వినతులు అందాయి. నూతన ఫించన్లు మంజూరు చేయాలని, నూతన గృహాలు మంజూరు చేయాలని ప్రజల నుంచి పెద్దఎత్తున వినతులు అందుతున్నాయి.

సమాజ నిర్మాణంలో యువతదే ప్రధాన భూమిక

ప్రజాశక్తి- నరసన్నపేట

మహాత్మాగాంధీ కలలుగన్న ఆదర్శవంతమైన గ్రామీణ సమాజ నిర్మాణంలో యువత ప్రధాన భూమిక పోషించాల్సిన అవసరం ఉందని ఎంఇఒ పి.దాలినాయుడు అన్నారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాల విద్యార్థులు సోమవారం ఇందిరానగర్ కాలనీలో సోమవారం ఏర్పాటు చేసిన జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ సేవా పథకం ఒక ముఖ్య సేవా సంస్థగా, సామాజిక మార్పునకు కృషి చేయడం జాతి గర్వించ దగ్గ అంశమన్నారు. ఒక మనిషి మరొక మనిషికి సహకరించడం మానవతా లక్షణమని, పది మందిలో ఉన్నప్పుడు మనవల్ల ఆ పదిమందికీ ప్రయోజనం ఉండాలని అన్నారు. కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సేవా భావం కలిగి ఉండాలన్నారు. సమాజానికి దిక్సూచి కావాలని కోరారు. సామాజిక చైతన్యం కోసం విద్యార్థులు కృషి చేయాలన్నారు. లక్ష్య సాధన కోసం సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు, పిఇ మోహన్‌దాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం సమన్వయకర్త కె.రాములు, అధ్యాపకులు బాబ్జి, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఇఒ దాలినాయుడు

విద్యార్థులను అభినందిస్తున్న విసి రజని

ఎన్ఎస్ఎస్ బృందానికి అభినందన

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

రోహ్తక్ (హర్యానా)లోని మహర్షి దయానంద్ విశ్వవిద్యాలయం నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరం 2025లో పాల్గొని ప్రతిభ కనపరిచిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వ విద్యాలయం ఎన్ఎస్ఎస్ బృందానికి వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని సోమవారం అభినందించారు. ఈ బృందానికి సమన్వయకర్తగా వ్యవహరించి జాతీయస్థాయిలో ఉత్తమ టీమ్ లీడర్, కంటింజెంట్ లీడర్ అవార్డులకు ఎంపికైన సందర్భంగా వర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. కె.కరుణానిధికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బి.అడ్డయ్య, ప్రిన్సిపాళ్లు డా. ఎం.అనురాధ, డా. సిహెచ్ రాజశేఖరరావు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డా.వనజ, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డా. ఎన్.అరుణకుమారి, పిఒలు భవాని, బి.వ్యాసగీత తదితరులు పాల్గొన్నారు. కాగా ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, విశిష్టతలు, ఆచార వ్యవహారాలు వంటివి తమ ప్రదర్శనల ద్వారా విద్యార్థుల బృందం ప్రదర్శించి పలువురి ప్రశంసలు అందుకున్నారు.

గ్రానైట్ క్వారీలో కార్మికుడు మృతి

మృతి చెందిన కర్రన్న

మెళియాపుట్టి: మండలంలోని జలక లింగపురం గ్రామ సమీపంలోని గ్రానైట్ క్వారీలో సోమవారం రాత్రి విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రాన కర్రన్న (46) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు సమాచారం. మృతుడికి భార్య తులసమ్మ, విష్ణు, శ్యామ్ ఇద్దరు పిల్లలున్నారు. మృతికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. కర్రన్న మృతదేహం ప్రస్తుతం టెక్కలి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. పూర్తి వివరాలు వెల్లడించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి- కవిటి

కిరణ్ (ఫైల్)

కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కవిటి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు పాండవ కిరణ్ (46) సోమవారం మృతి చెందారు. మండలంలోని జగతి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న కిరణ్ తీవ్రమైన అనారోగ్యంతో గత కొంతకాలంగా ఇంటివద్దనే ఉంటున్నారు. అయితే సోమవారం కిరణ్ ఆరోగ్య పరిస్థితి ఒక్కసారిగా విషమించడంతో మృతి చెందారు. కిరణ్‌కు భార్య జ్యోత్స్న, ఐదేళ్ల బాబు వరాన్ష్ ఉన్నారు. విషయం తెలుసుకున్న పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, కిరణ్ స్నేహితులు ఆయన భౌతికకాయాన్ని దర్శించి నివాళ్లర్పించారు. కిరణ్ మృతితో గ్రామంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి.

8 మంది బైండోవర్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని రెండు మండలాలు మున్సిపాలిటీలో ఎక్కడ బెల్ట్‌షాపులు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సిఐ పి.దుర్గాప్రసాద్ హెచ్చరించారు. గొలుసు దుకాణాల నిర్మూలనలో భాగంగా పాత కేసుల్లో ఉన్న 8 మంది నిందితులను వారి సత్ప్రవర్తన నిమిత్తం తహశీల్దార్ వెంకటరావు వద్ద బైండోవర్ సోమవారం చేసినట్లు తెలిపారు. ఈ బైండోవర్ ఏడాది పాటు అమలు ఉంటుందన్నారు. అతిక్రమిస్తే రూ.లక్ష అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సారా, అనధికార మద్యం విక్రయాలు నిర్వహిస్తే టోల్ ఫ్రీ నంబరు 14405కు సమాచారం ఇవ్వాలని కోరారు.

రేపు వర్క్‌షాప్

మెళియాపుట్టి: జీవనోపాధి అవకాశాలు, స్వయం ఉపాధి పథకాలు, అర్హత ప్రమాణాలపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 19న పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటిడిఎ సమావేశ మందిరంలో లివలిహుడ్స్, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్‌పై వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ జీవనోపాధి కార్యక్రమాలు, స్వయం ఉపాధి అవకాశాలు, వివిధ ప్రభుత్వ పథకాలపై అవగాహన, బ్యాంకు రుణం, రాయితీలపై ఆసక్తి కలిగిన గిరిజన యువతీ, యువకులకు అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు వర్క్‌షాప్ ప్రారంభమవుతుందని తెలిపారు. పదో తరగతి నుంచి పిజి వరకు విద్యార్హత కలిగిన వారు తమ ఆధార్, పాన్ కార్డులు, బ్యాంకు పాస్ బుక్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో పాల్గొవాలన్నారు. ఈ కార్యక్రమానికి పాలకొండ, పాతపట్నం ఎమ్మెల్యేలు పాల్గొంటారని అన్నారు. ఆసక్తి కలిగిన గిరిజన యువతీ యువకులు పాల్గొవాలన్నారు.

బిపిఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఆమదాలవలస : పురపాలక సంఘంలో అనుమతులు లేకుండా నిర్మించిన గృహవాణిజ్య భవనాల నిర్మాణాలను క్రమబద్ధీకరించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం బిల్డింగ్ ప్లీనలైజేషన్ స్కీం (బిపిఎస్)కు అనుమతులు మంజూరు చేసిందని, ఈ అవకాశాన్ని భవన యజమానులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా 1985 జనవరి నుంచి 2025 ఆగస్టు నెల 31లోపు నిర్మాణాలు పూర్తి కాబడిన నివాస వాణిజ్య భవన నిర్మాణాలు ప్లాన్‌కు డివియేషన్ ఉన్న అన్ని భవన నిర్మాణాలను ఒకేసారి రెగ్యులరైజేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం ఈనెల 14 నుంచి 11-3-2026 వరకు ఆన్‌లైన్‌లోగాని, ఎల్‌టిపి ద్వారా గాని దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని పురపాలక సంఘంలో గల భవన యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ దేవాలయ గెడ్డలు, బందలు, మాస్టర్ ప్లాన్ రోడ్లు, పార్క్ వినియోగించే స్థలాలు, లేఅవుట్ ఓపెన్ స్థలాల్లో భవనాలు నిర్మించిన వారు ఈ క్రమబద్ధీకరణకు అనర్హులని కమిషనర్ తెలిపారు.

జనసేన నాయకునికి పితృవియోగం

సింహాచలం (ఫైల్)

సంతబొమ్మాళి : మండలంలోని నౌపడ పంచాయతీ సీతానగరానికి చెందిన జనసేన నాయకుడు లింగూడు కుమార్‌కు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి లింగూడు సింహాచలం (65) ఆదివారం సాయంత్రం హఠాత్తుగా అస్వస్థతకు గురై కన్నుమూశారు. ఈయన మృతిపై గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు, జనసేనకార్యకర్తలు సంతాపం తెలిపారు.

కేసుల రాజీకి సహకరించాలి

టెక్కలి: డిసెంబరు 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ శాతం కేసులు రాజీకి న్యాయవాదులు, పోలీస్‌లు, కక్షిదారులు సమన్వయం చేసి రాజీకి ప్రయత్నించాలని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి బి.నిర్మల కోరారు. స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కక్షిదారుల్లో రాజీపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో టెక్కలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు పినకాన అజయ్ కుమార్, ఎజిపి దివ్వల వివేకానంద, న్యాయవాదులు వైకుంఠరావు పాణిగ్రహి, పేడాడ చంద్రశేఖర్‌ఆజాద్, సంపతరాజు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి నిర్మల

యువతకు ఉద్యోగాలే లక్ష్యం

ప్రజాశక్తి- నరసన్నపేట

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై నమ్మకం, ఐటి పరిశ్రమల మంత్రి నారా లోకేష్ కృషితోనే విశాఖ సిఐఐ భాగస్వామ్య సదస్సులో 13.25 లక్షల కోట్లకు పైగా విలువైన ఒప్పందాలు కుదిరాయని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని కత్తిరివానిపేటలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు బగ్గు అర్చనతో కలిసి సోమవారం మాట్లాడారు. కేవలం కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పరిశ్రమల స్థాపన, పెట్టుబడులకు దేశంలోనే మెరుగైన గమ్యస్థానాల్లో ఒకటిగా ఎపి నిలుస్తుందన్నారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పరిశ్రమలు తీసుకొస్తే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు.

శ్రీకాకుళం సిటీ: ఆంధ్ర ప్రదేశ్ పెట్టుబడుల దిశను మార్చే చారిత్రాత్మక వేదికగా విశాఖ సిఐఐ సమ్మిట్ ఎంతో దోహదపడుతుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. విశాఖ ఎ

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

కాలనీ క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ సదస్సు ద్వారా పెట్టుబడులు ఎపి గ్లోబల్ దృష్టిని కేంద్రీకరించేదిగా ఈ సదస్సు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ సమ్మిట్ సదస్సుకు వివిధ దేశాల నుంచి ఎంతో మంది వాణిజ్య వ్యాపార వేత్తలు ముందుకు రావడం వల్ల నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు నిండుగా కల్పించబడతాయన్నారు.

ఆధార్ సేవలు వినియోగించుకోవాలి

పోలాకి : ఈ నెల 26 వరకు మండలంలోని ఐదు సచివాలయాల పరిధిలోని ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ జి.రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని పోలాకి-2, మబగాం, డి.ఎల్.పురం, అంపలాం, జడూరు సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆధార్ నమోదు, తప్పులు ఉంటే సరిచేసుకోవాలని సూచించారు.

నేడు గ్రామాల్లో రచ్చబండ

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రవేటీకరణను వ్యతిరేకిస్తూ మంగళవారం రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైసిపి మండల అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని కేశవదాసుపురం, నందివాడ, బురిడికంచరాం, లోలుగు, కృష్ణాపురం, దల్లిపేట, బాణాం గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 3 గంటలకు వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జాయింట్ ఖాతాలు సరిచేసుకోవాలి

ఇచ్ఛాపురం : రైతులు తమ పొలాల్లో జాయింట్ ఖాతాలు సరిచేసుకోవాలని మండల సర్వేయర్ శంకరరావు సూచించారు. మండలంలోని కేసుపురం పంచాయతీలో రెవెన్యూ అధికారులు, రైతులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పొలాల్లో జాయింట్ ఖాతాలు సరిచేసుకోవాలన్నారు. అందరూ రైతులు తమ సేవలు వినియోగించే ప్రభుత్వం మంజూరు చేసిన అన్ని రకాల సహకారం అందించాలని సత్ సంకల్పంతో ఉన్నారని అన్నారు. మాజీ ఎంపిపి దక్కత ఢిల్లీరావు, డి.కామేశ్వరరావు, ఆర్ఐ సాహు, విఆర్ఒ సుందరరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

పొందూరు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వి.సత్యనారాయణ అన్నారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులకు సోమవారం నారీశక్తి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులపై జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే సైబర్‌క్రైమ్ 1930, బాల్యవివాహాలు నిరోధం 1098, పోలీస్ ఎమర్జెన్సీ 112 టోల్‌ఫ్రీ నెంబర్లపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈయనతో పాటు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుష్టు కేసులు వెలికితీయడమే లక్ష్యం

ప్రజాశక్తి- పోలాకి

కుష్టు కేసులు వెలికితీయడమే ఎల్‌సిడిసి లక్ష్యమని పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విస్తరణ అధికారి, వ్యాధి పరిశోధకులు డాక్టర్ నల్లి రవికుమార్ అన్నారు. పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో సోమవారం సర్వేను ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 47 టీమ్‌లు పనిచేస్తున్నాయని అన్నారు. ఇంటింటికీ దర్శించి ఎవరికైనా అనుమానస్పద, స్పర్శ లేని మచ్చలు, దలసరి నరాలు కనుబొమ్మలు రాలిపోవడం, ముక్కు నుంచి రక్తం కారటం, దారి రంగు గల స్పర్శ లేని మచ్చలు గమనించినట్లయితే వాటి సమాచారాన్ని అందజేయాలని అన్నారు. కార్యక్రమంలో మంగమ్మ, శేఖర్‌బాబు, మోహిని, లక్ష్మి పాల్గొన్నారు.

ఎస్ఎ పరీక్ష పరిశీలన

మెళియాపుట్టి: మండలంలోని నలంద పబ్లిక్ స్కూల్లో సోమవారం నిర్వహిస్తున్న ఎస్ఎ-1 పరీక్షల నిర్వహణను ఎంఇఒ ఎస్.దేవేంద్రరావు, ఎం.పద్మనాభరావు సోమవారం పరిశీలించారు. పరీక్షల సందర్భంగా విద్యార్థులు రాసిన పత్రాలను పరిశీలించిన అధికారులు, ప్రశ్నలను రాయడం, సమాధానాలను నిర్మాణబద్ధంగా రాయడం వంటి అంశాలపై సూచనలు అందించారు. పరీక్షల నిర్వహణ విధానం, పర్యవేక్షణలో అనుసరించాల్సిన నిబంధనలనూ పరిశీలించారు. కార్యక్రమంలో నలంద పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ జె.జె.ఎస్.ప్రతాప్, పోలాకి శారద, ధర్మారావు, మురళి, శ్రీను పాల్గొన్నారు.

కూరగాయల నారు పెంపకంపై శిక్షణ

మాట్లాడుతున్న కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి- ఆముదాలవలస

షేడ్‌నెట్ ప్రో, ట్రే విధానం ద్వారా కూరగాయల నారు పెంపకంపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న వృత్తి శిక్షణా కార్యక్రమం మొదటిరోజు కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా. కె.భాగ్యలక్ష్మి, ఈ శిక్షణ ఉద్దేశ్యాన్ని గిరిజన యువతకు వివరించారు. ఆధునిక సాంకేతిక పద్ధతులతో కూరగాయల నారు తయారీ, నాణ్యమైన రకాల ఎంపిక వంటి అంశాల్లో అవగాహన పెంచడమే లక్ష్యమని తెలిపారు. అనంతరం ఉద్యాన శాస్త్రవేత్త డా. వి.హరికుమార్ మాట్లాడుతూ షేడ్‌నెట్‌లో కూరగాయల తయారీ విధానం నూతన కూరగాయల రకాల ఎంపిక చీడపీడల నివారణ, కొత్త షేడ్‌నెట్‌లు ఏర్పాటు విధానంపై సుదీర్ఘంగా శిక్షణ అందించారు. పలాస, పాతపట్నం, మెళియాపుట్టి, మందస, కొత్తూరు, హిరమండలం ప్రాంతాలకు చెందిన యువ రైతులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా. సిహెచ్ బాలకృష్ణ, డా. సునీత, డా. కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఇచ్ఛాపురం చిన్నారులు

ఇచ్ఛాపురం: తిరుమల తిరుపతి బ్రహ్మోత్సవాలకు వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకడమి చిన్నారులకు ఆహ్వానం లభించడం సంతోషంగా ఉందని డ్యాన్స్ అకడమీ అధ్యక్షులు చిన్న గురుస్వామి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ చిన్నారులకు చక్కని అవకాశాన్ని మరోసారి అందించారు. ఈ నెల 19న వాహన సేవలో, 21న శిల్పారామంలో, 22న మహతి ఆడిటోరియంలో ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. నాట్య గురువులు నాట్యాచార్య ఏలేశ్వరపు శ్రీనివాసులు ఆధ్వర్యాన వీరు శిష్య బృందం దట్టి కావ్య, నీలాపు శైలు, సిల్ల పూజశ్రీ, చాట్ల జయలక్ష్మి, ఆసిపు శాతారాణి, కొరివి జాగృతి, బి.లిఖిత, ఎ.దీపిక, పి.జైత్రీకార్తన్య, మధుశ్రీ, పల్లవి, డి.సింధు,

శిక్షణ పొందుతున్న చిన్నారులు

జె.జాహ్నవి, కె.చంద్రకళ, సుజాత, హేమలత, బి.పూజ, డి.గాయత్రి డి.అక్షయ ఎంపికయ్యారు. పాల్గొంటున్న చిన్నారుల తల్లిదండ్రులు నాట్య గురువులు, అకడమీ అధ్యక్షులు చిన్నా గురుస్వామి, జయలక్ష్మి దంపతులకు అభినందించారు.

పరిశీలిస్తున్న ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- మందస

గ్రామాల్లో మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకుండా సాంప్రదాయ పద్ధతిలో పండించిన కూరగాయలు తదితర

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు గిరాకీ

ఉత్పత్తులకు మార్కెట్లో మంచి గిరాకీ ఉంటుందని వెలుగు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల నుంచి తెచ్చిన తాజా ఆకుకూరలు, పండ్లు, కాయగూరలు తదితర అన్ని ఉత్పత్తులూ కేవలం ఒక గంట కాలంలోపే అమ్ముడుపోతూ మంచి స్పందన లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సేంద్రీయ పద్ధతిలో కూరగాయలు పండించిన మహిళా రైతులతో పాటు మండల ప్రకృతి వ్యవసాయ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

కొబ్బరిలో కొమ్ముపురుగుతో నష్టం

ఎచ్చెర్ల: కొబ్బరిలో కొమ్ము పురుగు, ఎర్రముక్కు పురుగు రైతులకు నష్టాన్ని కలిగిస్తుందని ఎస్ఎస్ఆర్‌పురం ఎర్రంనాయుడు అగ్రికల్చరల్ కళాశాల డీన్ నారం నాయుడు అన్నారు. మండలం ధర్మవరంలో క్షేత్రస్థాయిలో పొలాలను పరిశీలించారు. కొబ్బరిలో కొమ్ముపురుగు, ఎర్రముక్కు పురుగు, ఐరియోఫిడ్ నల్లి, సర్పిలాకారపు తెల్లదోమను గుర్తించడం జరిగిందని, కొమ్ము పురుగు నివారణకు నాఫ్తలిన్ గోలీలు మొవ్వుకు అటు వైపు ఒకటి, ఇటువైపు ఒకటి, అదేవిధంగా క్లోరాంట్ర నిలిప్రోల్, సాచెట్లను పెట్టాలని సూచించారు. ఎర్రముక్కు పురుగు ఉధృతంగా ఉంటే ఇమిడాక్లోప్రిడ్ 1మీ.లీటరు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కొమ్ము పురుగు, ఎర్రముక్కు పురుగుకు బకెట్ ట్రాప్లను 1 హెక్టార్‌కి 2 చొప్పున పెట్టమని చెప్పడం జరిగిందన్నారు. సర్పిలాకారపు తెల్లదోమకు పసుపురంగు జిగట ముచ్చెలను కట్టమని, అదేవిధంగా సామూహికంగా వాటిని నివారించే విధంగా ప్రజలను అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది డా.దేవికారాణి, భవాని, డా.సత్యనారాయణ, శివాని, రమేష్ పాల్గొని రైతులకు సూచనలు అందించారు.

కొబ్బరి రైతులకు సూచనలిస్తున్న డీన్, సిబ్బంది

పాఠశాల పరిశీలన

రణస్థలం: రణస్థలంలో మండల ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలను ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు, రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీ నాయుడు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పిల్లలకు ఇస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. ముఖ్యంగా విద్యార్థినులు ధైర్యంగా ఉండాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చూసిన, వెంటనే పాఠశాల ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులు తెలియజేయాలన్నారు. వీరితోపాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

రక్త నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

హెచ్‌ఐవిపై అవగాహన

కవిటి: మండలంలోని బసవకొత్తూరులో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యాన ఎపి శాక్స్ సహకారంతో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోనల్ సూపర్‌వైజర్ పి.సుధాకర్ హెచ్ఐవి, ఎయిడ్స్, టిబి నిర్మూలన చర్యలు, సేవలపై అవగాహన సోమవారం కల్పించారు. హెచ్ఐవి బాధితులపై వివక్ష చేయవద్దని సూచిస్తూ, మరింత సమాచారం కోసం 1097కు కాల్ చేయవచ్చని తెలియజేశారు. ఈ సందర్భంగా 48 మంది హెచ్ఐవి రక్త పరీక్షలు చేయించుకున్నారు. సర్పంచ్ వాసుదేవరావు, ఎంపిటిసి సంతోష్ పట్నాయక్, బసవరాముడు, సిఎల్‌డబ్ల్యు రవి, ఆశా కార్యకర్తలు జయమ్మ, అంగన్వాడీ కార్యకర్త శారద పాల్గొన్నారు.

కేసులను ఉపసంహరించుకోవాలి

నరసన్నపేట: ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ నిరసనలపై అక్రమ కేసులను తీవ్రంగా ఖండిస్తున్నామని వైసిపి లీగల్ సెల్ నాయకులు అన్నారు. ఈ మేరకు సోమవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం రాజ్యాంగ హక్కులకు భంగం కలిగించే విధంగా, సామాన్యులకు నష్టం కల్పించే దుర్మార్గమైన నిర్ణయాలు తీసుకుంటోందని వైసిపి లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నిరలి గణేష్ తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలను పిపిపి పద్ధతిలో ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నించడం, పేద ప్రజలకు ఆరోగ్యాన్ని దూరం చేస్తుందని తెలిపారు. వైసిపి నాయకులు ధర్మాన కృష్ణచైతన్య నియోజకవర్గంలో శాంతియుతంగా నిరసన తెలిపితే, ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడం సరికాదన్నారు. సమావేశంలో న్యాయవాదులు గొండు సత్యం, శ్యామలరావు, బోర జగన్నాథం పాల్గొన్నారు.

వైసిపివి అసత్య ప్రచారాలు

నరసన్నపేట: ఇటీవల వైసిపి వారు నిర్వహించిన ర్యాలీపై అక్రమ కేసుల్లో బనాయించారని ప్రచారంలో అసత్యాలని, వాస్తవాలు లేవని టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. అనుమతులు లేకుండా ఏ ఒక్క కార్యక్రమం నిర్వహించినా చట్టం ప్రకారం దాని పని అది చేస్తుందని అన్నారు. అందులో రాజకీయ కోణం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అటువంటి అసత్య ప్రచారాలు మానుకోవాలన్నారు. టిడిపి నాయకులు కృష్ణంనాయుడు, సాసుపల్లి కృష్ణబాబు, జి.చిట్టిబాబు, పాగోటి ఉమామహేశ్వరి, ఎం.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డ్వాక్రా గ్రూపుల సమాఖ్య కార్యవర్గం ఎన్నిక

ఇచ్ఛాపురం: మండలంలోని బెల్లుపడ 13వ వార్డులో డ్వాక్రా గ్రూపుల సమాఖ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా లోపింటి రోహిని, ఉపాధ్యక్షులుగా ఆసి బాలా, కార్యదర్శిగా లండ నీలవేణి, సంయుక్త కార్యదర్శిగా దుర్గాసి రమ్య, కోశాధికారిగా బడే మీనాకుమారిలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, టిడిపి వార్డు ఇన్‌ఛార్జి రెయ్య జానికిరామ్, గిన్ని వెంకటరమణ, బర్ల హైమవతి అభినందించారు. కార్యక్రమంలో సంతోష్ కుమార్, రవికుమారి పాల్గొన్నారు.